క్లుప్తంగా

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంఈఓ విజయ్‌కుమార్

కార్వేటినగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా విద్యాబోధన చేయాలని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. బుధవారం కార్వేటినగరంలో అంగన్‌వాడీ వర్కర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణతో పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించాలని కోరారు. ఎంఈఓ–2 మనోజ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు అచ్చులు, హల్లులు రాసేవిధంగా ఆటపాటలతో కూడిన విద్యాబోధనతో ఉల్లాసం నింపాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు నరేష్, గురవయ్య, రఘురామకృష్ణమరాజు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ప్రాథమిక అక్షరాస్యతను అందించాలి



మాట్లాడుతున్న సెక్టోరల్ ఆఫీసర్ సారథి

పుత్తూరు: పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రాథమిక అక్షరాస్యతను బాధ్యతగా అందించాలని జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ సారథి ఆదేశించారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనా అభ్యాస సామగ్రిని తయారు చేసుకొని పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలని సూచించారు. అలాగే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం బోధించాలన్నారు. 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా తొలి విడతగా ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈసందర్భంగా ఆయన తెలిపారు. ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, సీడీపీఓ సంధ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనిత, గీతాంజలి, డీఆర్పీలు రమేష్, వెంకటేష్, భూపతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు సీజ్



సీజ్ చేసిన టిప్పర్లు

పుత్తూరు: పట్టణ పరిధిలోని నందిమంగళం గుట్ట నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఎస్ఎల్ లావణ్య ట్రాన్స్‌పోర్ట్, తమిళనాడుకు చెందిన టిప్పర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలించారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రావెల్ అక్రమ రవాణాకు సంబంధించి స్థానికుల నుంచి తమకు అందిన ఫిర్యాదు మేరకు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. టిప్పర్ యజమానులు రోడ్డు విస్తరణ పనులకు గ్రావెల్ తరలిస్తున్నట్లు చెబుతున్నారని, దీనిపై జిల్లా మైన్స్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అట్టడుగు పేదలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఏఎస్‌ఓ మునికృష్ణయ్య

పుత్తూరు: అట్టడుగు పేదలను గుర్తించి అత్యున్నత ధనవంతులతో అనుసంధానం చేసి చేయూతనందించడమే లక్ష్యంగా వార్డు సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని ఏఎస్ఓ మునికృష్ణయ్య ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు పీ4 (పబ్లిక్ ప్రైవేట్ ప్యూపెల్ పార్టనర్‌షిప్) సర్వే యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి 20 శాతం అట్టడుగు పేదలను గుర్తించి, 10 శాతం అత్యున్నత ధనవంతులతో అనుసంధానం చేయాలని తెలిపారు. ఈ సర్వే ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు పట్టణ, రూరల్‌లోని అన్ని సచివాలయాల్లో నిర్వహించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, ఎంపీడీఓ రమేష్‌బాబు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పాలసముద్రం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు బుధవారం ఎంపీపీ శ్యామల, ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

నిషేధమా..అదెక్కడ?

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- ప్లాస్టిక్ ఉత్పత్తులతో పర్యావరణానికి పెనుముప్పు
- క్షేత్రస్థాయిలో అమలుకాని నిషేధం



ప్లాస్టిక్ కవర్ల వాడకం దార్లకు ఫైన్ వేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)



ప్లాస్టిక్ కవర్‌లో తినుబండారాలు తీసుకెళ్తున్న యువకుడు

నగరి: మార్కెట్‌కు ఖాళీ చేతులతో వెళ్లి పాలిథిన్ సంచి నిండా సరుకులు తెచ్చుకోవడం.. సరుకులు తీసేసి సంచులను విచ్చలవిడిగా బయట పడేయడం ప్రజలకు పరిపాటిగా మారిపోయింది. ఒకప్పుడు బజారుకు వెళితే ఎంచక్కా గుడ్డ సంచో, నార సంచో చేత పట్టుకుని వెళ్లేవారు. మార్కెట్లో కావలసిన సరుకులు కొనుగోలు చేసుకొని ఆ సంచిలో తెచ్చుకునేవారు. అయితే కాలక్రమంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైంది. పాలిథిన్ బ్యాగులు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచులు మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి. దీంతో చేతి సంచుల సంస్కృతి కనుమరుగైంది. ప్రస్తుతం ప్లాస్టిక్ వాడకం రాజ్యమేలుతోంది. అవన్నీ మట్టిలోనూ, డ్రైయిన్లలోనూ ఎక్కడపడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఆ వ్యర్థాలు భూమిలోకి చేరడంతో భూమి తన ఉనికిని కోల్పోతోంది. పశువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. భూమి లోపల పాలిథిన్ వ్యర్థాలు పెరిగిపోవడంతో ఉష్ణోగ్రత పెరిగి మానవాళికి పెనుముప్పుగా మారుతోంది. ప్రజలు విచక్షణా రహితంగా పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ పడేస్తూ ఉండడంతో డ్రైయిన్లు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ పేరుకుపోతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో ప్లాస్టిక్ వాడకం, అమ్మకం నిషేధం. హోల్‌సేల్, రిటైల్‌గా ప్లాస్టిక్ అమ్మకాలు నిషేధించవలసిందిగా ఎన్నిసార్లు హెచ్చరించినా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం కలుషితమై ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం పొంచి ఉందని సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. గతంలో పట్టణంలోని వివిధ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు అపరాధ రుసుం విధించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడితే జరిమానా తప్పదని దుకాణాలకు స్టిక్కర్లు అంటించారు. అయితే ఇవేవి దుకాణదారుల్లో మార్పు తేవడం లేదు. మున్సిపల్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లగానే మళ్లీ ప్లాస్టిక్ అమ్మకాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. పలు దుకాణాలకు రాజకీయ నాయకుల సిఫార్సులు సైతం ఉండడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధంపై గతంలో అనేకమార్లు అధికారులు ప్రకటనలు చేసి పట్టణంలో ప్రతి దుకాణానికి నోటీసులు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అమలు శూన్యమని చెప్పవచ్చు. ప్రస్తుతం ప్లాస్టిక్ తనిఖీలు అటకెక్కిందన్న ఆరోపణలు ఉన్నాయి. వారపు సంత, కూరగాయల దుకాణాలు, కిరాణా షాపులు, టిఫిన్ బండ్లు, పండ్ల దుకాణాల్లో ఎక్కడ చూసినా పాలిథిన్ వాడకం ఎక్కువగా కనిపిస్తోంది. నగరి మున్సిపాలిటీతో పాటు వివిధ మండలాల్లో కల్యాణ మండపాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కవర్ల వాడకం అధికంగా ఉంటోంది. పట్టణంలో రోజుకు 13 టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తారు. దీనిలో 500 కేజీల ప్లాస్టిక్ ఉంటుందని అంచనా.



ప్లాస్టిక్ వినియోగించవద్దంటూ దుకాణాలకు స్టిక్కర్లు అతికిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

మొదటి వారం నుంచి స్పెషల్ డ్రైవ్



మున్సిపాలిటీ తరపున పలుమార్లు ప్లాస్టిక్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాం. అమ్మకపుదారులకు, వినియోగదారులకు జరిమానాలు విధించాం. అయినా మార్పు రావడం లేదు. మార్చి మొదటి వారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నాం. అప్పటి లోపు వ్యాపారుల్లో మార్పు రావాలి. లేకుంటే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అమ్మకం చేసినా, వినియోగించినా పర్యావరణ పరిరక్షణ చట్టం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల మేరకు కేసులు నమోదు చేస్తాం. ప్రజలు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ, నార సంచులు విధిగా తీసుకెళ్లాలి. వ్యాపారులకు సహకరించాలి.

– కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ

పథకాలకు ఫార్మర్ గుర్తింపు కార్డు తప్పనిసరి

– జిల్లా వ్యవసాయ సంచాలకులు లక్ష్మీప్రసన్న

పెనుమూరు(కార్వేటినగరం): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ కార్డు కలిగి ఉంటేనే పథకాల ఫలాలకు అర్హులవుతారని జిల్లా వ్యవసాయ సంచాలకులు లక్ష్మీప్రసన్న అన్నారు. బుధవారం మండలంలోని పులికల్లు, తిరివిరెడ్డిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. రైతులందరూ విధిగా విశిష్ట కార్డు నమోదు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్‌తో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ అయి కార్డు పొందితేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, అలాగే ఇతర వ్యవసాయ పథకాలు, రాయితీలు పొందడానికి అర్హత పొందుతారన్నారు. అనంతరం సాగులో ఉన్న చెరకు, మిరప ఇతర పంటలను పరిశీలించి సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



చెరుకు పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సంచాలకులు లక్ష్మీప్రసన్న

గుర్తింపు కార్డు నమోదు వేగవంతం



పత్తిపుత్తూరులో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రసాదరావు

వడమాలపేట (విజయపురం): మండలంలో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు సూచించారు. బుధవారం మండలంలోని పీసీ అగ్రహారం, తిరుమణ్యం, పత్తిపుత్తూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందితేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 5 వేల మంది వ్యవసాయ భూములు కలిగిన రైతులు ఉన్నారని, అందులో పీఎం కిసాన్ లబ్ధిదారులు 3,300 మంది ఉన్నారని తెలిపారు. 5 వేల మంది రైతులకుగాను 2,200 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయ్యిందని తెలిపారు. మిగిలినవి 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

ఆక్రమణ భూముల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



తమిళనాడు వాసులు చదును చేసిన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అరుణ కుమారి హెచ్చరించారు. వనదుర్గాపురంలో తమిళనాడు వాసులను ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడడంపై సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురించిన కథనంపై ఆమె స్పందించారు. మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓ వెంకటాచలంతో కలిసి ఆక్రమణ ప్రాంతాన్ని పరిశీలించారు. తమిళనాడు వాసులు జేసీబీతో ప్రభుత్వ భూమిని చదును చేసినట్లు గుర్తించారు. ఈ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు పెట్టాలని తహసీల్దార్ వారిని ఆదేశించారు.

సీసీ కెమెరాలతో ఇంటికి భద్రత



సీసీ కెమెరాలను చూపుతున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్

పెనుమూరు (కార్వేటినగరం): ప్రతి ఇంటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పెనుమూరు ఎస్‌ఐ రాజ్‌కుమార్ కోరారు. బుధవారం పెనుమూరు పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఇంటిల్లిపాదీ విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు చోరీలు జరగకుండా ఇంటి భద్రతకు సీసీ కెమెరాలు దోహదపడతాయని, రూ.2 వేలకు ఇవి అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు స్టేషన్‌లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. అలాగే పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



వీర్లగుడిలో తాగునీటి సమస్యపై మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఎక్కువగా తలెత్తే గ్రామాలోని చేతిపంపులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తాము కొండ సమీపంలో ఉన్నామని, వేసవిలో తాము తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, చేతిబోరుకు మరమ్మతులు చేయించాలని వర్లగుడి వాసులు కోరారు. మండల విస్తరణాధికారి రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లల్లో అక్షర స్థాయి పెంచుదాం

నింద్ర: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పథకం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్‌రాజు తెలిపారు. ఆయన మట్లాడుతూ బుధవారం నింద్రలోని జిల్లా ఉన్నత పాఠశాలలో జరిగే శిక్షణ కార్యక్రమం ఐదు రోజులు పాటు జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అక్షర స్థాయిని పెంచడం కోసం శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రిసోర్స్‌పర్సన్స్‌గా శ్యామల, సురేష్, రాజేష్, గోపినాథ్ ఉంటారని అన్నారు. హెచ్ఎంలు శివయ్య, గిరిజావతి పాల్గొన్నారు.

రుణ దరఖాస్తుదారుల సమావేశం రేపు

పుత్తూరు: బీసీ, ఓసీ కార్పొరేషన్ల నుంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని కమిషనర్ మంజునాథ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ బ్యాంకు మేనేజర్లతో నిర్వహించే సమావేశానికి దరఖాస్తుదారులు తమ రుణ దరఖాస్తు పత్రం, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డు, క్యాస్ట్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలని పేర్కొన్నారు.

అన్నదానం ట్రస్టుకు రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు బుధవారం ఓ దాత విరాళం అందజేశారు. విజయవాడకు చెందిన దాత కల్యాణ వెంకటగణపతి రూ.లక్ష నగదును విరాళంగా సమర్పించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యను నేర్పాలి

- ఎస్ఎస్‌ఏ పీఓ వెంకటరమణ

బంగారుపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని మొగిలిమిట్టూరు, తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని పీడీతో పాటు ఎంఈఓ నాగేశ్వర్‌రావు సందర్శించారు. వారు మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధికి, పిల్లల అభ్యసన నైపుణ్యాలు పెంపొందించడానికి జ్ఞానజ్యోతి శిక్షణ దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో మెళకువలను నేర్చుకుని 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు బోధనా సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. మండలంలో 101 మంది కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీడీపీఓ వాణిశ్రీదేవి, హెచ్ఎంలు పట్టాభి, పార్థసారథి, రిసోర్స్‌పర్సన్లు మోహన్‌రెడ్డి, రేవతి, ధనంజయరాజు, చంద్రశేఖర్, సూపర్‌వైజర్ జయశ్రీ పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

పుత్తూరు: పట్టణంలోని పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నవంబర్‌లో నిర్వహించిన జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో విద్యార్థులందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. కంటి లోపం ఉన్న 28 మంది విద్యార్థులను గుర్తించి వారికి సరిపడా కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. హెల్త్ అసిస్టెంట్ శేఖర్ రెడ్డి, ఆశా వర్కర్ సులోచన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు తీసుకున్న విద్యార్థులు

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ కుమార్

పాలసముద్రం: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య బోధించాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. బుధవారం ఎమ్మార్సీ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజోతి కార్యక్రమంపై రిసోర్స్‌పర్సన్ కుమార్, సంగీత శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు విద్యతోపాటు ఆటపాటలు నేర్పించాలన్నారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు పేర్కొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



అవగాహన ర్యాలీ చేస్తున్న అటవీ అధికారులు

పాలసముద్రం: అడవులకు నిప్పు పెడితే మానవాళికి ముప్పు తప్పదని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మధు హెచ్చరించారు. అడవులకు నిప్పు పెడితే కలిగే నష్టాలపై బుధవారం ఎల్ఎన్ పురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడవులకు నిప్పు పెట్టినా, వన్య ప్రాణులను వేటాడినా చట్టపరంగా కఠినమైన కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ వరవరాజు, విజయ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు చల్లచల్లగా..



నేలపై వేసిన మ్యాట్

కాణిపాకం: అప్పుడే ఎండలు మండుతున్నాయి. ఉదయం 8గంటలకే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఆపై ఎండ నుంచి నీడ కోసం ప్రజలు వెతుక్కుంటున్నారు. మధ్యాహ్నానికి ఎండ తీవ్ర అధికంగా ఉంటోంది. ఈ తరుణంలో కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని చురుగ్గా ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ గ్రీన్ మ్యాట్‌తో నీడ కల్పించారు. భక్తుల నడక కోసం మ్యాట్ వేసి నిత్యం నీళ్లతో తడుపుతున్నారు. దీంతో పాదరక్షలు లేకుండా ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తున్నారు. త్వరలో కూల్ పెయింట్ వేయనున్నామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోం..అవమానిస్తే ఊరుకోం!

- సర్పంచ్‌లంటే విలువ లేదు
- చులకనగా చూస్తే ఊరుకోం
- తీర్మానం లేకుండా సిమెంట్ రోడ్డు ఎలా వేశారు ?
- హైకోర్టుకు వెళతాం
- రసాభాసగా సర్వసభ్య సమావేశం



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

విజయపురం: ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకు కనీసం గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా అధికారులు లేదంటే..అసలు మీరు రాజకీయ నాయకులా లేక అధికారులా అంటూ ఎంపీటీసీ, సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. గురువారం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. ముందుగా వివిధ శాఖల అధికారులు తన నివేదిక వివరాలను సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో వేసిన సిమెంట్ రోడ్లపై ఎంపీటీసీ, సర్పంచ్‌లు పీఆర్ ఏఈ వీరభద్రను నిలదీశారు. అభివృద్ధి జరగడం మంచిదే కానీ సర్పంచ్ తీర్మానం లేకుండా పనులు ఎలా చేశారో చెప్పాలంటూ ప్రశ్నించారు. మీ పనితనం చూస్తుంటే రాజకీయ నాయకులు కొమ్ముకాస్తున్నట్లు ఉందన్నారు. గ్రామ స్థాయిలో ఏదైనా పనిచేయాలంటే సర్పంచ్ తీర్మానం తప్పనిసరి అని తెలిసి కూడా మీరెందుకు పాటించలేదన్నారు. ఇది వరకు మండలంలో జరిగిన సిమెంట్ రోడ్డు పనులన్నింటికీ తీర్మానం కాపీ చూపించాలని కోరారు. ఇకపై కూడా ఇలాగే కొనసాగితే రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

చులకనగా చూస్తే ఊరుకోం...

ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌లను చులకనగా చూస్తే ఊరుకోం..వీలైతే హైకోర్టుకు వెళ్లి న్యాయం పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. అభివృద్ధి పేరుతో అధికారులు రాజకీయం చేయడం సరికాదన్నారు. గ్రామస్థాయిలో జరిగే ప్రభుత్వ పనులకు సర్పంచుల అనుమతి అవసరం లేదని జీఓ ఉంటే చూపాలని, అలా జీఓ ఏదైనా ఉంటే ఇప్పుడే రాజీనామా చేసి ఇంటికి వెళతామని అన్నారు. వైస్ ఎంపీపీ బాలాజీ మాట్లాడుతూ ఎంపీటీసీ, సర్పంచ్‌ల కోరిక న్యాయమైందని, అధికారులు కూడా సర్పంచులను అనుసరించి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ రాజేంద్ర ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ఎక్కడ తప్పు జరిగిందో విచారించి న్యాయ చేస్తామని, అందుకు కొంత సమయం ఇవ్వాలని ఆయన కోరారు. తహసీల్దార్ కిరణ్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.